క్లుప్తంగా

కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్ వెట్రిసెల్వికు మొక్క అందిస్తున్న నాయకులు

ఏలూరు(మెట్రో): కలెక్టర్ కె.వెట్రిసెల్విని ఈనెల 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఏపీఎన్‌జీవోస్ నాయకులు ఆహ్వానించారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా నిర్వహించినందుకు ఆమెను అభినందించారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో నిర్వహించే మహిళా దినోత్సవ క్రీడలకు ఉద్యోగినులకు ప్రత్యేక పర్మిషన్ ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

వెంకటేశ్వరరావుకు పరామర్శ



వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): అడిషనల్ పబ్లిక్ ప్రాసెక్యూటర్ ఆచంట వెంకటేశ్వరరావు కుమార్తె మృతి బాధాకరమని వైఎస్సార్ సీపీ స్టేట్ వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవకుమార్, రాష్ట్ర ఫారెస్టు మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ అన్నారు. ఇటీవల వెంకటేశ్వరరావు చిన్న కుమార్తె మృతి చెందింది. ఆయన కుటుంబానికి నాయకులు సానుభూతిని తెలియజేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు రూరల్ : చాటపర్రు ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ కేఎం అంబేద్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. చాటపర్రు, చంద్రబాబు నాయుడు కాలనీ, ఎస్సీ కాలనీ, బాబూఖాన్ గూడెంకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

మూసుకుపోతున్న సీతంపేట కాల్వ



చెత్తాచెదారాలతో ఉన్న సీతంపేట కాల్వ

దెందులూరు: మండలంలోని సీతంపేట కాలువ పరిధి కుదించుకుపోతుంది. కాలువ రెండు వైపులా గట్లు వెడల్పు తగ్గటం రెండు వైపులా చెట్లు, కర్రనాచు, చెత్తాచెదారం, తూడు విపరీతంగా పెరిగిపోయాయి. వేలాది ఎకరాల సాగు సీతంపేట కాలువ ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరుతున్నారు.



జెడ్పీ నుంచి ఇండోర్ స్టేడియం రోడ్డుకు వెళ్లే దారిలో ఫుట్ పాత్‌పై నిర్వహిస్తున్న వ్యాపారాలు



స్థానిక ఎన్ఆర్‌పేటలో ఫుట్‌పాత్‌పైకి వచ్చేసిన వ్యాపారులు

ఫుట్‌పాత్‌ల అదృశ్యం

- నగరంలో యథేచ్ఛగా ఆక్రమణలు
- వ్యాపారాల నిర్వహణ
- పట్టించుకోని అధికారులు
- పాదచారులకు అవస్థలు

ఏలూరు (టూటౌన్): పాదచారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా రాకపోకలకు సాగించేందుకు నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఏలూరు నగరంలో అదృశ్యమవుతున్నాయి. వీటిని ఆక్రమించి చిన్న బడ్డీ కొట్లు, టీ స్టాల్స్, తోపుడు బండ్లు వంటి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ ఆక్రమణలను అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది. నరసింహారావుపేట, ఆర్ఆర్‌పేట, పవర్‌పేట, వన్‌టౌన్‌లోని మెయిన్ బజారు ఇలా ఫుట్‌పాత్‌లు ఉన్న అన్ని ప్రాంతాలూ ఆక్రమణకు గురవుతున్నాయి.

ఆక్రమణలు ఇలా..

నిత్యం రద్దీగా ఉండే జిల్లా పరిషత్ సెంటర్‌లో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఇక్కడ పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ఇండోర్ స్టేడియం వైపు వెళ్లే దారిలో టీడీపీకి చెందిన నాయకుడు ఒకరు రెండు షాపులను లీజుకు తీసుకుని వాటిలో ఫుడ్ ఐటెమ్స్‌కు సంబంధించిన వ్యాపారం చేస్తున్నారు. ఆయనకు పక్కనే మరో చోటా నాయకుడితో హోటల్ ఏర్పాటు చేయించారు. ఇందులో భాగంగా టీ స్టాల్‌ను ఏకంగా ఫుట్‌పాత్‌పైనే ఏర్పాటు చేశారు. ఆయన ఫుట్‌పాత్‌పైనే ఒక జ్యూస్ షాపు, బిర్యానీ డెలివరీ కౌంటర్ వంటివి ఏర్పాటు చేశారు. వీటిపై వివిధ పత్రికల్లో ఎన్ని కథనాలు వచ్చినా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు వాపోతున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న వారితో తమకెందుకులే అనే ధోరణిలో నగరపాలక సంస్థ అధికారులు వ్యవహరించారనే విమర్శలూ ఉన్నాయి.



ఆర్ఆర్‌పేట వెంకటేశ్వరస్వామి గుడి సెంటర్‌లో ఆక్రమణలో ఉన్న ఫుట్ పాత్



ఆక్రమణలతో నడిచేందుకు వీలులేకుండా ఉన్న జెడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ ముందు ఉన్న ఫుట్ పాత్



కర్రల వంతెన నుంచి వసంత మహల్ సెంటర్ ఫుట్‌పాత్‌పైనే కూరగాయల వ్యాపారం

ఆక్రమణ బాధాకరం



ప్రజలకు ఉపయోగపడే ఫుట్‌పాత్‌లను ఆక్రమించేసి నిర్మాణాలు చేపట్టడం బాధాకరంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే జిల్లా పరిషత్ సెంటర్‌లో ఆక్రమణలకు ఉపక్రమిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలి.
– జి.గోపీ, సీఐటీయూ నేత, ఏలూరు

అక్రమ నిర్మాణాలను తొలగించాలి



ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలను తక్షణం తొలగించాలి. పేదలు రోడ్డు పక్కన చిన్న బడ్డీ కొట్లు, తోపుడు బండి పెట్టుకుని జీవనోపాధి పొందుతుంటే ఆఘమేఘాలపై వచ్చి తొలగించే యంత్రాంగానికి ఫుట్‌పాత్‌ల ఆక్రమణ కన్పించక పోవడం శోచనీయం.
– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

పుణ్య కార్యాలు చేయండి



దీక్ష ప్రారంభ ప్రార్థన చేస్తున్న బిషప్ జయరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన తపస్సు కాలంలో పుణ్యకార్యాలు చేసి దేవునిలో ఎదగాలని ఏలూరు పీఠాధిపతి, విశాఖపట్నం అగ్రపీఠం అపోస్తలిక పాలనాధికారి బిషప్ పొలిమేర జయరావు పిలుపునిచ్చారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి కథీడ్రల్ ఆవరణలో విచారణ గురువు ఫాదర్ ఇంజమాల మైఖేల్ ఆధ్వర్యంలో తపస్సు కాల దీక్షలను ప్రారంభించారు. కార్యక్రమంలో బిషప్ జయరావు మాట్లాడుతూ తపస్సు కాలంలో ఎక్కువగా ప్రార్థనలు, ఉపవాసాలు చేసి పేదలకు దానధర్మాలు చేయాలన్నారు. తొలుత ఆయన దివ్య బలిపూజ నిర్వహించారు. విచారణ గురువు ఫాదర్ మైఖేల్ మాట్లాడుతూ క్రైస్తవుల ఉపవాసాల కాలం బుధవారం నుంచి ప్రారంభమైందన్నారు. ఇది దేవుని మార్గంలో నడవడానికి అనుకూల కాలమని వివరించారు. కార్యక్రమంలో ఫాదర్లు బి.రాజు, స్టీవెన్ థామస్, విద్యాసాగర్, కార్పొరేటర్ ఎం నిర్మల, డి.అబ్రహాం, జె.బెనర్జీ, ఎస్ థామస్, పలువురు సిస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

టైలరింగ్, కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ యువతకు టైలరింగ్, కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి, ఆ పైన విద్యార్హత గల మహిళలకు టైలరింగ్‌లో 30 రోజులు, 10వ తరగతి ఆ పైన విద్యార్హత గల యువతీ, యువకులకు కంప్యూటర్ ట్యాలీ, ఎమ్మెస్ ఆఫీస్ కోర్సుల్లో 30 రోజులు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అర్హులు ఫోన్ నెంబర్లు 99485 65256, 90140 40780, 95330 79471లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మృతుల్లో ద్విచక్రవాహనచోదకులే ఎక్కువ



చోదకులకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రోడ్డు ప్రమాద మృతుల్లో ఎక్కువ మంది ద్విచక్రవాహన చోదకులేనని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ అన్నారు. బుధవారం స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో కరీమ్ ఆధ్వర్యంలో రవాణా, ట్రాఫిక్ పోలీసులు ద్విచక్ర వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ ధరించని, ట్రిపుల్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేని, వాహన బీమా లేని ద్విచక్ర వాహనాలకు సంబంధించి 82 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా కరీమ్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని గణాంకాల ద్వారా తెలుస్తోందన్నారు. ఖచ్చితంగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలు, లైసెన్స్ ఆవశ్యకతను వివరించారు. తనిఖీల్లో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు బి.భీమారావు, ఎస్‌బీ శేఖర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు ఎస్ జగదీష్ బాబు, వీఎల్ కళ్యాణి, డి.ప్రజ్ఞ, ట్రాఫిక్ సార్జంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానాలకు రక్షణ కల్పించాలి

ఏలూరు (టూటౌన్): దళితవాడల్లో ఉన్న శ్మశాన వాటికలకు రక్షణ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేటలోని అన్నే వెంకటేశ్వరరావు భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎం జీవరత్నం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలు గాలికి వదిలేసి పేదలపై భారాలు వేస్తోందని మండిపడ్డారు. 2004లో రాజశేఖరరెడ్డి ప్రభుత్వం దళితవాడలలో శ్మశానాల అభివృద్ధికి జీఓ 1235 తీసుకొచ్చినా నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. పేదల ఇళ్ల నిర్మాణానికి మూడు సెంట్ల స్థలం, రూ.ఆరు లక్షల నగదు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి

ఉపాధి హామీ పథకంలో తీసుకొచ్చిన మార్పులను విరమించి, పాత పద్ధతినే కొనసాగించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

12న మహాధర్నా

సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ దెందులూరు మండలం దోసపాడు, పోతునూరు, కొవ్వలి, పెదవేగి మండలం ముండూరు, విజయరాయి, వేగివాడ, జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం, తాడువాయి పంగిడిగూడెం, టి.నర్సాపురం మండలం ఏపుకుంట చింతలపూడిలో అన్యాక్రాంతమైన అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం మార్చి 12న విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వై.నాగేంద్రరావు, తామా ముత్యాలమ్మ, ఎస్ మహంకాళి రావు, ఉడతా వెంకటేష్, మడకం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో బహుళ ప్రయోజనాలు

భీమడోలు: రీసర్వేతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికయిన సూరప్పగూడెం రెవెన్యూ గ్రామంలో రీసర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆమె పర్యవేక్షించారు. పాతూరులోని పంట పొలాలకు వెళ్లి అక్కడ మ్యాప్‌లను పరిశీలించారు. డ్రోన్ ద్వారా వచ్చిన సర్వే నెంబర్లు, విస్తీర్ణాలకు సంబంధించిన ఛాయచిత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారుల నుంచి వివరాలు సేకరించారు. రీసర్వే అనంతరం పొలాల విస్తీర్ణం, ఖాతాలు సరిగ్గా ఉన్నాయా లేదా అని రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత సర్వే శాఖ అధికారులపై ఉందని జేసీ అన్నారు. మరో రెండు రోజుల్లో ఈ గ్రామంలో రీసర్వే పూర్తవుతుందని చెప్పారు. పాతూరులోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి, వంట గది, కోడి గుడ్లు, చిక్కీల నాణ్యతను పరిశీలించారు. బాలబాలికలతో కొద్ది సేపు ముచ్చటించారు. ఇంగ్లీషు పుస్తకాలను చదివించారు. కార్యక్రమంలో ఆర్డీఓ అచ్యుత అంబరీష్, సర్వే శాఖ ఏడీ రమణ, డీఐ రమాదేవి, సర్వేయర్ ధర్మారావు, ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

సారా నిందితుల అరెస్టు

కొయ్యలగూడెం: సారా నిందితులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం బుధవారం పేర్కొన్నారు. కన్నాపురంలో సారా కలిగి ఉన్న వీరంకి ఏడుకొండలు, షేక్ సయ్యద్ బాజీలను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరికి నాటుసారా సరఫరా చేస్తున్న వేముల ఏసుబాబు కుంజ దుర్గారావులపై కేసు నమోదు చేశామన్నారు.

అమరవరం రేంజ్‌లో విచారణ

కుక్కునూరు: అమరవరం అటవీ రేంజ్ పరిధిలో యథేచ్ఛగా సాగుతున్న మారుజాతి కలప అక్రమ రవాణాపై బుధవారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అటవీశాఖ జిల్లా అధికారులు బుధవారం అమరవరం రేంజ్ పరిధిలోని బర్లమడుగు, కొండిన్యముక్తి టేకు ప్లాంటేషన్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో నిఘాను కట్టుదిట్టం చేయాలని రేంజ్ అధికారిని ఆదేశించినట్టు తెలుస్తుంది. విధులలో సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్టు సమాచారం.

డీఈఓకి వినతి

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు ఎంపీపీ స్కూల్‌ని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలంటూ గ్రామ పెద్దలు బుధవారం డీఈఓకి వినతి పత్రం అందజేశారు. దీనిపై పాఠశాలలను సందర్శించి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెడతానని డీఈఓ హామీ ఇచ్చారని గ్రామ పెద్దలు తెలిపారు. గిడా గిరటయ్య బాబు, దుగ్గిరాల విజయభాస్కర్, అత్తర్ సిద్దు సాహెబ్ పాల్గొన్నారు.

పొగాకు బేరన్ల దగ్ధం



అగ్నిప్రమాదానికి గురైన బేరన్

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెంలో బుధవారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఒక పొగాకు బేరన్ పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన సత్యనారాయణ, అర్జున్‌రావు అనే వ్యక్తులకు చెందిన బేరన్లు పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. గ్రామస్తులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే బేరన్ పూర్తిగా దగ్ధమైంది.

కన్నాపురంలో..

కొయ్యలగూడెం : కన్నాపురం గ్రామంలో సంభవించిన అగ్నిప్రమాదంలో బుధవారం నాలుగు బేరన్లు దగ్ధం అయ్యాయి. వర్జీనియా పొగాకు క్యూరింగ్ దశలో ఉండగా అగ్ని ప్రమాదం సంభవించినట్టు ఎంపీటీసీ ఎస్‌కే బాజీ తెలిపారు. రైతు అల్లూరి రాంబాబుకి చెందిన నాలుగు బేరన్లలో సుమారు రూ. 10 లక్షల విలువైన పొగాకు దగ్ధమైందన్నారు. బేరన్లు ఒకదానికొకటి పక్కపక్కనే ఉండటం వలన ప్రమాద తీవ్రత పెరిగిందన్నారు. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసిందని తెలిపారు. రేషన్ కర్ర క్యూరింగ్ గొట్టంపై పడటతో ప్రమాదం సంభవించి ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	28	బీళ్ల చిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	30	కంద	72
కాకర కాయలు	36	బీట్‌రూట్	32
బీరకాయలు (పందిరి)	44	కీరా దోస	40
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	60
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10–12
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	20–36	పుదీనా	05
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	26
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	38
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	20
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు – తిరుపతి	16.0	4830	33
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25